[illegible] సహోలి:

# వ్యాపార దక్షత

"అంగారకుడు"

ఆమధ్య కాన్వర్డ్ ఫజిల్‌కి డబ్బు కట్టినప్పటినుంచీ నాకు ఎక్కడలేని ఆరాటమూ పట్టుకున్నది. ఒక్కసారి పాతికవేలు వచ్చిపడితే ఏమి చేయాలా అన్నది ఒక సమస్య అయిపోయింది. ఆ డబ్బును ఎట్లా ఉపయోగిస్తే అది పెరిగి పిల్లల్ని పెడుతుందా, అన్న తొందర తప్పితే మరొకటి లేకపోయింది. అందుకని, బాగా డబ్బుచేసినట్లు పేరు పడ్డవాళ్ళ దగ్గిరికల్లా వెళ్ళి సలహాలు అడిగాను. సంప్రదింపులు జరిపాను.

అందులో ఒకాయన చాలా అద్భుతమయిన ఒక పథకం వేసిపెట్టాడు.

* * *

"ఏమండీ! మీ దగ్గరకు ఒక చిన్న సలహా కోసం వచ్చానండీ" అన్నాను.

ఆయన చిన్ననవ్వు నవ్వి చెప్పమన్నట్లుగా తల ఆడించాడు.

"మావాడొకడు పెద్ద ఆస్తికి పెంపకం వెళ్ళి, అంతా జలకడుక్కున్నాడు. బుద్ధి తెచ్చుకుని చూసేటప్పటికి పోయింది పోగా పాతికవేల రూపాయలవరకూ మిగిలి ఉన్నది. దాన్ని ఎట్లాగయినా నిలుపుకుని కాలం వెళ్లదియ్యాలని వాడి కోరిక. మీరు కొంచం దయచేసి వాడికొక మార్గం చూపించాలి."

"మనకు చాతయినట్టు చూద్దాంలెండి... ఇంతకూ మీవాడి ఉద్దేశం ఏమిటి? ఒడుదుడుకులు లేకుండా ఏదో కొంచంగా వస్తుంటే చాలనుకుంటున్నాడా, లేకపోతే—"

"లేదండీ, కొంచం పెద్దమొత్తాలుగానే రావటం అవసరం."

"మరయితే, మనిషి తెలివితేటలు, ధైర్యసాహసాలూ కలవాడేనా?"

"అహా! వాటికేమీ లోపం లేదు. కొంచం బుద్ధి ఇన్నాళ్లూ పెడదోవ పట్టింది కాని."

"అయితే మీవాడిని బ్లాక్‌మార్కెట్‌లోకి దిగమనండి."

ఒక్కసారి గుండె గుభేలు మన్నది.

"ఆఁ బ్లాక్‌మార్కెటా?"

"అవును."

నెహ్రూగారి హెచ్చరికలూ, మెహతాబ్‌గారి ఉద్ఘాటనలూ, పటేల్‌గారి అభిభాషణలూ ఒక్కసారిగా నన్ను కలవరపెట్టటం మొదలుపెట్టినవి.

"అందులోమాత్రమే డబ్బు పుష్కలంగా చేయటం వీలవుతుంది."

దీనితో ధనలక్ష్మి గాజుల గలగల చెవుల్లో ప్రవేశించి హెచ్చరికలకూ, ఉద్ఘాటనలకూ, అభిభాషణలకూ ఉద్వాసన చెప్తుంది.

"అందులో ప్రమాదమేమీ లేదుగదా" అని బొంగురు గొంతుతో ప్రశ్నించాను.

ఆయన మళ్ళీ ఇంకో నవ్వు పారేసి, ఇంతమాత్రం దమ్ములు లేవా అన్నట్లు చూశాడు.

ఇంతలోకి ఆయనకొడుకు ఇద్దరికీ కాఫీ ఇచ్చి వెళ్లాడు.

ఆయన మొదలుపెట్టాడు.

"బ్లాక్‌మార్కెట్ అన్న పేరు మిమ్మల్ని గాభరాపెడుతున్నది. కాని అందులో కష్టం కానీ, ప్రమాదం కానీ, కొత్తవిషయం గానీ, ఏమీ లేవు. ఇదుగో ఈ కాఫీ చూడండి. బ్లాక్‌మార్కెట్‌ని కాచి వడపోసినసారమే ఇది."

"నిజం?"

"నిజమే. కాఫీపొడిని బ్లాక్‌మార్కెట్‌లో కొనుక్కురావాలి. దాన్ని కాచి వడపోసి పంచదార వెయ్యాలి. ఈ పంచదార రావలసిందికూడా బ్లాక్‌మార్కెట్‌నుంచే, ఇంక పాల విషయం. నీళ్లు కలిపి వెన్న తీసిన బ్లాక్‌మార్కెట్‌పాలు"

"మీరు చెప్పింది నిజమే."

"ఇవన్నీ యథావిధిగా ప్రతినిత్యం జరిగిపోతూ ఉంటయ్. ఇట్లాగే అన్ని రకాల బ్లాక్‌మార్కెట్ కూడా" అని ఆయన ధైర్యం చెప్పాడు.

దీంతో కొంచం మనసు తెరిపిన పడ్డది.

"అయితే పథకం పూర్తిగా సెలవియ్యండి."

"బ్లాక్‌మార్కెట్ చేయదలచుకున్నవాళ్లు ఏకాగ్రతను సాధించాలి. ఆ లక్ష్యం తప్పితే, మనసు వేటినీ అంటకుండా, తామరాకుమీద నీటిబొట్టువలే ఉండాలి. డబ్బు సంపాదించాలన్న మహాలక్ష్యం పాపపుణ్యాలూ, దయాధర్మాలూ మొదలైన స్వల్పవిషయాలకోసం చలించకూడదు. జనం ఒక సరుకుకోసం అలమటిస్తున్నారనుకోండి. అది కాస్తో, కూస్తో ఎక్కడయినా దొరుకుతుంటే ముందు దాన్ని మాయం చెయ్యాలే కాని 'అయ్యో పాపం' అనుకోకూడదు. సరుకు ఎంత అపరూపంగావుంటే ధర అంత పలుకుతుంది."

నా మనసులో జీర్ణించిపోయిన మధ్యతరగతి సంస్కారం ముఖంలో కొంచం సందేహాన్ని చూపించినది.

"మీరు కొంచం సందేహిస్తున్నట్లున్నారు. కాని అది నిజమైనది కాదు. హోటల్లో ముప్పావలా బిల్లు చేసి బయటికి వస్తూ, ఎముకలు పొడుచుకునివచ్చిన బిచ్చగాడికి, కాని డబ్బయినా పడెయ్యరు. వాడి బాధను చూసికూడా పట్టించుకోరే! ఇంక మీకున్న సందేహం ఎట్లాంటిది?"

వెన్నుపుష్టి లేని నా పాపభీతి ఆ దెబ్బతో తోకముడిచి పారిపోయింది.

"పాపపుణ్యాల ఆలోచన వదులుకొనుటన్నది బ్లాక్‌మార్కెట్‌దార్లు నైతికంగా చేయవలసినపని. ఇంక పోతే అసలు పనిని నడపటానికి వేరే హంగు కావాలి.

నేను ఎంతో శ్రద్ధగా వినటం మొదలుపెట్టాను.

"బ్లాక్‌మార్కెట్ చేయదలచుకున్నవాడు దేశంలో ఏ సరుకులు సమృద్ధిగా దొరుకుతున్నదీ, వేటికి కొరతగా ఉన్నదీ జాగ్రత్తగా తెలుసుకోవాలి. కంట్రోళ్ళకు సంబంధించిన రూల్సు యావత్తూ క్షుణ్ణంగా తెలుసుకుని ఉండాలి. అప్పుడే వాటిని తప్పించుకుని తిరగటం వీలవుతుంది. ఆ సన్నాహాలన్నీ అయినతరవాత పర్మిట్ల కోసం బయలుదేరాలి."

అదీ వరస అన్నట్లు ఉత్సాహంతో తల ఊగించాను.

"ఈ పర్మిట్లవేట వెనకటికన్నా ఇప్పుడు కొంచం కష్టమయిన మాట నిజమే. కాని అసాధ్యం మాత్రం కాదు. ఆర్థిక చిక్కుల్లో ఉన్న రాజకీయనాయకులు, ధనాశగల నాయకులు ఇందులో మనకి చాలా ఉపయోగిస్తారు. పర్మిట్లు మన పేరుమీదనే వస్తే సరేసరి. లేకపోయినా అట్టే ఇబ్బంది లేదు. వాటిని తెచ్చినవాళ్ళకు కొంచం చెయ్యి తడిచేస్తే సరి."

"ఎట్లాగయినా అవి అంత సులభంగా దొరకటం లేదండీ" అన్నాను.

"అంతమాత్రంచేత వచ్చే ఇబ్బందేమీ లేదు. పర్మిట్లు దొరక్కపోతే, ఏజన్సీ

(19-వ పేజీ చూడండి)

# వ్యాపారదక్షత

(14-వ పేజీ తరువాయి)

కోసం ప్రయత్నించాలి. ఈ రెండు పద్ధతులూ అన్నిటిలోకీ శ్రేష్ఠమైనవి. ఇవి సాధ్యపడకపోతే, సొంత తెలివిమీద పని సాగించాలి."

"కొంచం విప్పి చెప్పండి."

"నామటుకు నన్ను చూడండి. నేను రంగంలోకి దిగేటప్పటికి యుద్ధం మొదలయింది. సైన్యానికి కావలసిన వస్తువుల మీద మాత్రం కంట్రోళ్లు ఉండేవి. యుద్ధం కొన్నాళ్ళపాటుసాగితే ఏ సరుకుల సప్లయి నిలిచిపోతుందా అని పరిశీలించినమీదట, రంగులనీ, మందులనీ ఊరూరూ గాలించి, కొని, నిలవజేశాను. తరవాత వాటికి కంట్రోలు రావటం, గిరాకీ పెరగటం జరిగి, మనకు ప్రభ ఎత్తుకున్నది. ఆ తరవాత సిమెంటు, ఇనుము, గుడ్డలు, బియ్యం, అగ్గిపెట్టెలు, కిరసనాయిలు, పంచదార మొదలైన సరుకుల్లో ఏజన్సీలనూ, పర్మిట్లనూ సాధించాను.

"అయితే ఇప్పుడు దాదాపు అన్ని వస్తువులూ కంట్రోలుకింద ఉన్నవి కదా: ఆ వ్యాపారంలో చాలామంది ముందునించే స్థిరపడిఉన్నారేమో నండీ!"

"ఆమాట కూడా నిజమే. బ్లాక్ మార్కెట్ లైన్లో కూడా 'నో-వేకన్సీ' బోర్డు తగిలించాల్సివచ్చేట్లే ఉన్నది. అయితే నేం, ఇంకా ఎన్ని సరుకులు లేవుకనక ? ఉదాహరణకు విలాసవస్తువులు తీసుకోండి. వాటి దిగుమతులమీద విధి నిషేధాలున్నవే కాని దేశంలో అమ్మటానికి ఆటంకాలేమీ లేవు. వాటి హోల్‌సేల్ డీలర్లకు మనం నమ్మకం కలిగించి సరుకును సంపాదిస్తే చాలు. ఆ తరవాత కేటలాగు ధరలతో మనకు సంబంధం లేదు. సబ్బులు, బ్లేడ్లు, తలనూనెలు, స్నోలు, పౌడర్లు మొదలైన వాటితో కోలాహలంగా కథ నడపొచ్చు.

"జనంవద్గర డబ్బు తగ్గిపోతున్నది. కదా, విలాసవస్తువులమీద, ఎంతని సంపాదించగలం ?"

"డబ్బు తగ్గినా, విలాసాలు అంత మాత్రంలో తగ్గేవి కాదు. అయితేమాత్రమేం ? పిల్లలకు కావలసిన పాలడబ్బాలు మొదలైనవి కలవుకదా! స్కూలు కుర్రాళ్ళకి కావలసిన వస్తువులన్నీ ఉన్నవి కదా! ఏది ఎట్లా ఉన్నా మీరు సొంత తెలివితేటలు ఉపయోగిస్తే, ఎన్నో అవకాశాలు వాటంతట అవే కనిపిస్తయ్. ఈవిషయం చూడండి. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడ్డదన్నా, కృష్ణానదిలో సుడిగుండం వచ్చినదన్నా, మీకు పెద్ద అవకాశం లభస్తుంది. అ దేమిటో చెప్పగలరా?"

అది మన బుర్రకి అందలేదు.

"బొంగులండీ, బొంగులు! తుపాను వచ్చినా, వరదలు వచ్చినా మొదట దెబ్బతినేవి పూరిళ్ళే కదా! వాటిని మళ్లీ కట్టటానికి వెదురుబొంగులూ, తాటాకులు కావాలి. అందువల్ల మనం ముందే జాగ్రత్తపడి వాటన్నిటినీ కొని ఉంచితే సరి. ఇట్లాగే పెంకుటిళ్ళకు కావలసిన పెంకులు, కలపకూడా నిలవ చేయాలి."

'అదీ దెబ్బ' అని నేను హుషారుగా అన్నాను.

"ఒకటి అడుగుతాను చెప్పండి. దక్షిణాదిన అగ్నిగుండాలు చెలరేగితే ఏం చేస్తారు ?"

"చింతపండుగింజల్ని కొని నిలవ చేస్తారు."

"ఎందుకని ?"

"జనం ఎక్కువమంది వాటినే తింటున్నారు కనుక. అగ్ని ప్రమాదాలతో ధాన్యం నాశనం కావచ్చును కనుక."

"భేష్! అట్లా ఉండాలి. అయితే మీరు ఇంక నల్లి సన్నాహాలు ప్రారంభించవచ్చు."

"కాని...నాకొక సంగేహం ఉన్నదండీ! ఇవన్నీ మనం చేస్తుంటే పట్టుబడతామేమో ?"

"ఆ భయం అక్కర్లేదు. ఒకటిమాత్రం చేయండి. అమ్మకాలూ, లావాదేవీలు మాత్రం మీరు స్వయంగా జరపొద్దు. ఏ గుమాస్తాగాడినో పెడితే, వచ్చే దెబ్బ వాడి మీదికే వస్తుంది."

"సోషలిస్టులూ, అసలు గాంధేయులు మొదలైనవాళ్ళు పికెటింగు జరుపుతారటగా !"

"ప్రమాద మేమీ లేదు. మనం నిజంగా బ్లాక్‌మార్కెట్ జరుపుతున్నట్టు వాళ్ళకి రుజువు వుంటే సరాసరి రిపోర్టే చేస్తారు. రుజువు లేకుండా పికెటింగు మొదలు పెడితే, మన పరువుకి నష్టం కలిగిస్తున్నట్టు ఆరోపించి, జైళ్లలోకి తోయిస్తాము."

"మారుమూల అడవుల్లో తిరిగే కమ్యూనిస్టుఘటాలే అధికారులను తప్పించుకోలేక పోతున్నారే, అటువంటిది మీ రావట్లా వాళ్లకు చిక్కక పోవటం ఆశ్చర్యంగానే ఉంది."

"స్వయంగా రంగంలోకి దిగిన తరవాత ఆ విషయం మీకే తెలుస్తుంది."

"ఒక సంగతి చూశారూ! వెనకటి మోస్తరుగా తప్పించుకునే అవకాశాలు కనిపించటంలేదు. ఈ మధ్య చాలా చోట్ల బ్లాక్‌మార్కెట్‌వాళ్ళని అరెస్టు చేయటమే కాక సంకెళ్ళతో రోడ్లవెంబడి నడిపిస్తున్నారట."

"హుఁ! మేమేనా తక్కువ తిన్నది? బ్లాక్‌మార్కెట్ నిరోధం ప్రాథమికహక్కులకే భంగం కలిగిస్తున్నదని సుప్రీంకోర్టుకి వెళ్లబోతున్నాము."

"అది ఎట్లా నిలుస్తుంది?"

"ఎట్లా నేమిటి? రాజ్యాంగంలో ఆస్తిహక్కు, వృత్తిహక్కు ఇవ్వబడ్డవి. ఇష్టం వచ్చిన సమయంలో సరుకును కొని, ఇష్టం వచ్చిన ధరలకు అమ్మటమే వ్యాపారం అంటే. దానిని ఆటంకపరచటం ప్రాథమిక హక్కులను తోసివేయటమే కదా."

"మీరు చెప్పింది బాగానే ఉందండీ, అయినా, సుప్రీంకోర్టు ఎట్లా తీర్పు చెపుతుందో—

"అంతటితో ఆగుతామా? సుప్రీంకోర్టు మాకు వ్యతిరేకిస్తే యు. ఎన్. ఓ. కి— అంటే ఐక్యరాజ్యసమితికే వెడతాం. అంతర్జాతీయ న్యాయసమ్మతమయి. ప్రపంచాభివృద్ధికి మూలకారణమయిన స్వేచ్ఛా వ్యాపారానికి 'బ్లాక్‌మార్కెట్' అన్న పేరుతో వర్ణదోషం అంటగట్టి, వాణిజ్య వర్గాన్ని నిర్మూలించటానికి భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తాం. అంటే జనహత్య, వర్ణవివక్షత, మానవ హక్కుల అపహరణ అనే ఆరోపణలను చేస్తాం. అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్‌లు సమితిలో ఉన్నంతవరకూ మనకు ఢోకా లేదు."

ఆ తెలివితేటలకు నాకు గుక్క తిరగ లేదు. ఇటువంటి అహిరావణుడి సహాయం ఉంటే తక్కువేమిటని ఆయనకు ఒక నమస్కారం పడేసి, పజిల్సు వాళ్లదగ్గరనుంచి టెలిగ్రాం వచ్చిందేమో కనుక్కునేందుకు పోస్టాఫీసుకి పరుగెత్తాను.

కాని ఎవరికయినా మొహాన రాసిపెట్టి ఉండొద్దూ? చివరకు నాకుప్రైజు హుళక్కి అయింది. ఇంత దివ్యమైన పథకాన్ని ఉపయోగించుకునే సత్తా నాకు లేనే లేదు. కదా, డబ్బు చేతిలో ఆడుతున్నవాళ్లయినా ఉపయోగించుకుంటారేమో నన్న ఉద్దేశంతో ప్రకటిస్తున్నాను.

---